# రేపు

—వాణిశ్రీ.

రిటైరై పోవడం కూడా ఒక జబ్బే అనిపించింది. రిటైరై పోయాక తాతలనాటి ఇల్లుంది కాబట్టి స్వగ్రామం వెళ్ళి వుండక తప్పలేదు.

తిట్టే నోరూ తిరిగే కాలూ వూరికే వుండ లేవనే సామెతగా క్రింద ఉద్యోగుల్ని కేకలేస్తూ, తరచుగా క్యాంపులు వెళ్ళడానికి అలవాటు పడిన నేను కాలం గడవక తన్నుకు చస్తుండే వాడిని.

అలాంటప్పుడు శ్రీపతి పళ్ళ కొట్లోకో, విఠల్ రావు పొగాకు కంపెనీకో వెళ్ళి కాలక్షేపం చేస్తుంటాను. పలురకాల పళ్ళవాసనలతో శ్రీపతి కొట్టు ఘుమఘుమలాడుతూ వుంటే విఠల్ గాడి ఆఫీసులో బ్రాందీ వాసన, పలావు పరిమళాలతో కలగాపులగంగా వుండేది.

చిన్ననాటి స్నేహితులు కాబట్టి నాకు ముఖ్యంగా కాలక్షేపం కావాలి కాబట్టి వాళ్ళు వాయించుకునె సొంతడబ్బా, వాళ్ళతో అవసరం వున్నవాళ్ళు వేస్తుండే తాళాలు, సన్నాయి నొక్కులూ ఓపిగ్గా వింటూవుండేవాడిని. అప్పుడప్పుడూ శ్రీపతితోపాటు పళ్ళతోటలకే గాక విఠల్ వెంట హైక్లాస్ సొసైటీలో తిరగడానికి గూడా అలవాటు పడ్డాను.

ఆ రోజు ఆదివారం. బోర్ గావుందని శ్రీపతి నన్నూ విఠల్ ని వాళ్ళ మామిడితోటకి లాక్కెళ్ళాడు. విరగ్గాసిన మామిడిచెట్లు కనువిందు

చేస్తుండే తోటంతా తిరుగుతున్నాం. ఏ చెట్టు ఏరకం కాయలు కాస్తుందో వివరించి చెప్తున్నాడు శ్రీపతి. తోట మధ్యకి రాగానే పాలరాతితో కట్టించిన మండపం నన్నెంతో ఆకర్షించింది మధ్యలోవున్న సమాధి ఎవరిదోగాని దానికి ఖర్చు పెట్టిన డబ్బుతో నాబోటిగాడు డాబా ఇల్లు కట్టుకోవచ్చును.

"ఎవరిదిరా ఈ సమాధి? ఎంత అందంగా కళాత్మకంగా కట్టించారో?" అన్నాను.

"దానికి ఎంత ఖర్చయిందో నీకు తెలుసా!" అన్నాడు శ్రీపతి గర్వంగా.

"ఏమో?"

"ఏభైవేలు" అన్నాడు మెరుస్తున్న కళ్ళతో. అంత డబ్బు సమాధి కోసం ఖర్చుపెట్టిన ఘనత నాదే అన్నట్లుంది వాడి సంతోషం.

కాని ఆ సంఖ్య నాకేం ఆశ్చర్యం కలిగించలేదు. డబ్బున్న మారాజులు సమాధుల కోసం ఎంతైనా ఖర్చు చెయ్యడం మనకి కొత్తగను కనా? అలనాడు ఈజిప్టు రాజులు కట్టించిన పిరమిడ్స్, షాజహాన్ ప్రేమ చిహ్నం "తాజ్‌మహల్" ఆయనగారి కొడుకు భార్య పేరున నిర్మించిన బీబీ కా మక్బారా అందుకు నిదర్శనాలేగదా? ఇక నాకు తెలియని మహానుభావులు ఈ ప్రపంచ చరిత్రలో ఎందరున్నారో గదా?

"ఇంతకీ ఎవరి సమాధి?" అని మళ్ళీ అడిగాను.

"నన్నడక్కపోతే దగ్గరగా వెళ్ళి దానిమీద చెక్కించిన అక్షరాలు చదవరాదూ? కళ్ళజోడు తెచ్చుకోలేదా ఏరా?" అంటూ నవ్వాడు విఠల్. రిటైరై పోయాక నాబుర్ర బండబారిందేమో? విఠల్‌గాడు చెప్పేవరకూ నాకా ఆలోచనే రాలేదు. నేను మెట్లెక్కి సమాధి దగ్గిరిగి వెళ్ళి దాని మీదున్న పేరు చదివి అదిరిపోయాను.

అది శ్రీపతిగాడి పేరే. కాకపోతే వాడు చావబోయే తేదీ, మాసము సంవత్సరమూ ఖాళీగా వుంచారు. పరీక్షల్లో ఖాళీలు పూరింపుము అన్నట్లుగా వాడు చచ్చిన తర్వాత చెక్కుతారు కాబోలు.

సంభ్రమాశ్చర్యాలతో మూర్ఛపోయినంత పనయింది. ఎవడి సమాధి వాడు కట్టించు కోవడం పురాణాల్లో వుందేమోగాని యీ కాలంలో వినడం, చూడడం యిదే ప్రథమం.

నేను పిచ్చిమొఖం వెయ్యడం చూసి విఠల్ పకపకా నవ్వుతూ "చచ్చిన తర్వాత అల్లుళ్ళు ఇంత ఖర్చుపెట్టి సమాధి కట్టిస్తారో లేదోనని వీడికి భయం పట్టుకుంది. అందుకే ఆర్నెల్లు కష్టపడి సమాధి కట్టించు కున్నాడు, కొడుకులు లేరుగా పాపం అన్నాడు.

"కొడుకులుంటే మాత్రం నువ్వు చేసిందేమిట్రా? చచ్చిన తర్వాత శవాన్ని కాల్చడానికి గంధపు చెక్కలు కొనిపెట్టుకోలేదూ" అన్నాడు శ్రీపతి.

నాకీసారి మతిపోయినంత పనైంది. ఏమిటీ విఠల్‌గాడు గూడా తక్కువ తినలేదన్నమాట. ఎప్పుడో చచ్చిన తర్వాత కాల్చడానికి గంధపు చెక్కలు కొనిపెట్టుకొన్నాడన్నమాట. ఓరి వీళ్ళ వైభోగం పాడుగానూ?

"దేర్ ఈజ్ నో ఫూల్ లైక్ యాన్ ఓల్డ్ ఫూల్" అని ఎవరన్నా రోగాని వీళ్ళ ధోరణి చూస్తే నాకు అక్షరాలా నిజమనిపించింది.

"మరి నువ్వు గంధపుచెక్కలు కొనలేదా?" అని శ్రీపతిని ప్రశ్నించాను.

అందుకు విఠల్‌గాడే సమాధానం చెప్పాడు

కొనేవాడేగాని వాళ్ళ కులంలో శవాన్ని కాల్చరు, పూడుస్తారు."

"మరి సమాధి కట్టేశారు గదరా ? నీ శవాన్ని ఏలా పూడుస్తారు ?" అని నా సందేహం వెళ్ళబుచ్చాను.

"నీ తెలివి తెల్లారినట్లేవుంది. సమాధిని ఇంకా ఫిక్స్ చెయ్యలేదు. నీడు చచ్చాక దాన్ని తీసి ప్రక్కనపెట్టి శవాన్ని పూడ్చి తర్వాత పర్మినెంట్‌గా ఫిక్స్ చేస్తారు" అంటూ వివరించాడు విఠల్.

"మరి నీసంగతేమిటి? కాల్చిన తర్వాత అస్తికలు వుంచి సమాధి కట్టించాలిగదా? నువ్వెప్పుడు మొదలు పెడుతున్నావు" అన్నాను విఠల్‌తో.

"నాకా భయం లేదురా. ఇద్దరు కొడుకులున్నారు. గ్రాండ్‌గా అంత్యక్రియలు చేస్తారు. వీడికన్నా బాబులాకట్టిస్తారు నా సమాధి" అంటూ మీసం మెలేసాడు విఠల్‌గాడు.

ఓరి వీళ్ళ గొప్పలు తగలబడిపోనూ అనుకున్నాను.

ఏరు ఎన్ని వంకరలు పోయినా సముద్రంలోనే పడాలన్నట్లు చచ్చిన తర్వాత నరకానికి పోయ్యేవాళ్ళకి సమాధుల గురించి తాపత్రయాలు ఎందుకో పిచ్చిగాకపోతే.

"అయినా ఉక్కుముక్కల్లా వున్నారు మీకప్పుడే ఇదేం భయంరా" అన్నాను.

"అరవై దాటిపోయాయి సర్వీసయిపోవచ్చిందిగదా, ఏమో రేపు ఏం జరుగుతుందో ఎవరికి తెలుసు?" అన్నాడు శ్రీపతి

సర్వీసయిపోయినా కొంత స్పేర్ పార్టు తీసిన బెంజిలారీల్లా సర్వీసు చేస్తూనేవున్నారు. అయినా యముడు అంత అర్జంటుగా రాడు లేరా! ముందు నోటీసు యిచ్చి బయల్దేరతాడు?"

"యముడు నోటీసు ఇస్తాడనుకో. కాలయముడనేవాడు ఇంకొకడున్నాడు. వాడు వార్నింగివ్వకుండానే ఎండాకాలంలో గాలివానలా వచ్చేస్తాడట" అన్నాడు శ్రీపతి నవ్వుతూ.

"మరి నీ సంగతేమిట్రా?" అన్నాడు విఠల్.

"నాకూ మీకూ సామ్యమా? నక్కకూ నాకలోకానికి పోత్తెక్కడ?"

"అదేం మాటరా నువ్వు తల్చుకుంటే అదెంత పని?" అన్నాడు శ్రీపతి.

"వచ్చే పెన్షన్‌తో గుడ్డిలో మెల్లలా సాగుతోంది సంసారం. సమాధి గొడవెందుకు? నవ్వుతాడు ఎవ్వడైనావింటే, మీ సంగతి వేరు. మీరు కీర్తి శేషులు కాబోతున్నారు కాబట్టి మీకా తాపత్రయం."

"అంటే నువ్వు....?"

"నేనా అపకీర్తిశేషుణ్ణి" అన్నాను నవ్వుతూ.

వాళ్ళిద్దరూ తెల్ల మొఖాలు వేశారు,

"చచ్చాక నన్ను తిట్టేవాళ్ళేతప్ప కీర్తించే వాళ్ళెవర్రా ?" మానాన్న పెద్దచదువు చదివించివుంటే ఏ డాక్టరో, ఇంజనీరో అయి నాలుగు చేతులా సంపాదించుకుంటూ సుఖంగా వుండేవాళ్ళం గదాఅని తిట్టుకుంటూ వుంటారు కొడుకులు. నన్ని గుమస్తాకిచ్చి గొంతుకోశాడు మా నాన్న. కట్నం ఎక్కువిచ్చి ఏ ఆఫీసర్‌కో యిచ్చివుంటే కారులో తిరుగుతూ మేడలో కాపురం చేసేదాన్ని గదా అనుకుని వాపోతుంది కూతురు. మరి మీరు ? పదితరాలు కూర్చునితిన్నా తరగని సంపద పిల్లలకి యిచ్చి పోతున్నారు. దాన ధర్మాలు చేసి పురప్రముఖులై పోయారు. ఇంట్లో డబ్బు ఊళ్ళో కీర్తి సంపాదించిన వారు గనుక మీరు కీర్తిశేషులుగాక మరేమిటి ?"

వాళ్ళిద్దరూ పగలబడి నవ్వుతున్నారు.

*   *   *

సంవత్సరంపాటు ఎటూ కదలకుండా వుండేసరికి చిరాకనిపించి ఎటైనా వెళ్దాం అనుకుంటుండే సమయానికి మా అమ్మాయి బెంగుళూరు

నుంచి లెటర్ రాసింది. ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించుకుంటున్నాను వెంటనే రమ్మని. మా ఆవిడ ఎగిరి గంతేసింది.

బెంగుళూరు వెళ్ళాక మా అల్లుడు ఎంతకీ కదలనివ్వలేదు. మూడు నెలలు అక్కడేవున్నాం. ఊళ్ళో అడుగుపెట్టేసరికి పిడుగులాంటి దుర్వార్త వినాల్సి వచ్చింది. నాలుగురోజులక్రితం శ్రీపతి పెద్దకూతుర్ని చూడటానికి లండన్ వెళుతూ విమాన ప్రమాదంలో మరణించాడట. విమానం సముద్రములో కూలిపోయింది. శవంగూడా లభ్యంకాలేదట.

మామిడితోటలో తను స్వయంగా నిర్మించుకున్న సమాధిలో శాశ్వతంగా నిద్రపోవాలనుకున్న వాడి ఆశ అడియాసయింది గదా!

రేపు ఏం జరుగుతుందో? ఎవరు ఎక్కడ ఎలా మరణిస్తారో ఎవరూ చెప్పలేరు గదా? అనుకుని దీర్ఘంగా నిట్టూర్చాను.

*　　　*　　　*

శ్రీపతి పోయాక నాకు ఆరోగ్యం బాగాలేక విఠల్ దగ్గరికి వెళ్ళడం గూడా కుదరడంలేదు. ఎప్పుడైనా తీరిగ్గా వున్నప్పుడు వాడేవచ్చి చూసి పోతున్నాడు.

వేసవికాలం వచ్చింది మే నెలలో ఎండలు తీవ్రంగా వున్నాయి. ఒక రోజు విఠల్ వచ్చి "కాశ్మీర్ వెళుతున్నాం. మీ చెల్లాయిగూడా వస్తుంది మీరిద్దరూ వచ్చి తీరాలి. టిక్కెట్లుగూడా రిజర్వు చేసేశాను. రానంటే తంతాను" అంటూ గొడవపెట్టేశాడు.

ఇక తప్పేదేముంది? నాకు కోనసీమయినా కాశ్మీరయినా ఒక్కటే. కావాల్సింది కాలక్షేపం, చలో కాశ్మీర్ అన్నాను.

బోట్ హౌస్‌లో మకాంపెట్టి కాశ్మీర్ వింతలు విడ్డూరాలూ, రమ్యమైన ప్రకృతి దృశ్యాలు చూసుకుంటూ సరదాగా కాలం గడపడం అన్నకో శివరాత్రిలా ఎంతో థ్రిల్లింగ్‌గా వుంది.

ఒకరోజు సాయంకాలం "టీ" చప్పరిస్తూ కబుర్లు చెప్పుకుంటున్నాం. విఠల్ వున్నట్లుండి గుండె దగ్గిర చేతులు పెట్టుకుని బాధతో గిలగిల కొట్టుకొసాగాడు, సమయానికి అబోట్ హౌస్ యజమాని గూడా అక్కడే వుండి సాయపడ్డాడు. ఇద్దరం కలిసి హాస్పిటల్‌కి తీసుకెళ్ళాం. కాని ఏం లాభం? తర్వాత అరగంట సేపు మృత్యువుతో పోరాడి ఓడిపోయాడు.

నన్ను నేను ఓదార్చుకుంటూనే విఠల్ భార్యని ఓదార్చాల్సి వచ్చింది. నా భార్య ఆమె శోకాన్ని చూడలేక తనూ ఏడవడం సాగించింది.

కొడుకులు, కూతుళ్ళు కోడళ్ళు అల్లుళ్ళు, మనవలు అశేష బంధు మిత్రులు వుండి గూడా ఇక్కడ దిక్కులేని వాడిలా ఆఖరి శ్వాస వదలడం విచిత్రంగాక మరేమిటి?

విఠల్ శవాన్ని ప్రత్యేక విమానంలోనైనా మావూరు తీసుకెళ్ళాలని ఎంతో ప్రయత్నం చేశాను. విమానం దొరికేవరకూ ఆగడంకంటే శవాన్ని అక్కడే దహనం చెయ్యడం మంచిదని డాక్టర్‌తో సహా అందరూ సలహా యివ్వడంతో చేసేదేంలేక దహనం చేశాను.

వాడికి ఆ సమయంలో నేనే కొడుకు నయ్యాను.

రేపు ఎంత విచిత్రమైంది?

(ప్రచురణ : ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 31-7-80)

....o....